క్లుప్తంగా

నాయకుల బైండోవర్


బైండోవర్ అవుతున్న కొడుపాక నాయకులు

పాపన్నపేట(మెదక్): ఎన్నికల వేళ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రధాన పార్టీలకు చెందిన నాయకులను బైండోవర్‌లు చేస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మండల పరిధిలోని కొడుపాక మాజీ సర్పంచ్ పంతుల భూమన్న, అప్సర్, నర్సింలు, మల్లంపేట సర్పంచ్ బాపురెడ్డిలను పోలీసులు డిప్యూటీ తహసీల్దార్ విజయలక్ష్మి ఎదుట బైండోవర్ చేశారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డిని సైతం బైండోవర్ చేశారు. మండలంలో సమారు 14 మంది నాయకుల బైండోవర్‌కు జాబితా వెలువడింది. అయితే ఇందులో కనీసం పోలీసు కేసులు లేని వారి పేర్లు ఉండటంపై కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా గరుకుస్తంభ ప్రతిష్ఠ


ప్రవచనం వింటున్న భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్ గ్రామ శివారులోని గోశాలలో దాత బండపోసాన్‌పల్లి గ్రామానికి చెందిన పిట్ల మనోహర్ సహకారంతో గరుకస్తంభ ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన సత్యనారాయణ నిర్వహిస్తున్న గోశాలలో అరుణాచలానికి చెందిన రుద్రాక్ష మణికంఠ స్వామి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ జరిగింది. గోమాతకు తొట్టెల నిర్వహించారు. అదేవిధంగా కాళీమాత మందిర నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అనంతరం భక్తులకు ప్రవచనం చెప్పారు. పలు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రంలో వసతుల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న భిక్షపతి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎన్నికలు దగ్గర పడుతున్న సందర్భంగా పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల్లోని వసతులు పరిశీలించామని రూట్ అధికారి భిక్షపతి అన్నారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని రహీంగూడ, జగ్గంపేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎంలు పంపిణీ చేసేందుకు సరైన రూట్ ఎంపిక చేసుకున్నామని, అదేవిధంగా ప్రతీ పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసుకున్నామన్నారు. ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శంకర్

అల్లాదుర్గం(మెదక్): ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ శంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం నాగరాజు, సీసీ అబేద్, అలీహుసెన్, ఏఈఓ మహేశ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి

తూప్రాన్: మున్సిపల్ కేంద్రంలోని 13వ వార్డులో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. మంగళవారం సంత కావడంతో మార్కెట్‌లో కుండల వ్యాపారికి కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో క్రీడాపోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.


పాపన్నపేట(మెదక్): కుర్తివాడ ఉన్నత పాఠశాలలో..



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో..


పెద్దశంకరంపేట(మెదక్): కొత్తపేటలో..


వెల్దుర్తిలో నృత్యం చేస్తున్న విద్యార్థులు


తూప్రాన్‌లో..


శివ్వంపేట అంగన్‌వాడీ కేంద్రంలో ..


చేగుంట(తూప్రాన్): వల్లభాపూర్ ప్రాథమిక పాఠశాలలో..

పాఠశాలల్లో మాక్‌పోలింగ్


పాపన్నపేట(మెదక్): ఓటు వేయడానికి బారులు తీరిన విద్యార్థులు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని పొడిచన్‌పల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఈవీఎంలు, ఓటింగ్ వినియోగంపై అవగాహన కల్పించారు. సోషల్ స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ దేవయ్య ఆధ్వర్యంలో పోలింగ్ కొనసాగింది. కార్యక్రమంలో హెచ్ఎం ప్రతాప్ రెడ్డి, కిషన్, భవాని ప్రసాద్, వెంకటేశం, గణేశ్, శ్రీలక్ష్మి, రవి, శ్రీనివాస్, అమీనా బేగం, పాషా పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట జెడ్పీ పాఠశాలలో విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్ ఎన్నికల ప్రక్రియపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాక్‌పోలింగ్ ప్రక్రియను ఉపాధ్యాయులు బస్వరాజ్, రజిత పర్యవేక్షించారు.


చిన్నశంకరంపేట(మెదక్): చందంపేటలో..

శివ్వంపేట(నర్సాపూర్): ఓటుహక్కు గురించి ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని దొంతి ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ రవి అన్నారు. దొంతి పాఠశాలలో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎన్నికలు, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాధ, రమేశ్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

తూప్రాన్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలుపొంది అధికారంలోకి రావడం ఖాయమని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తూంకుంట నర్సారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ యావాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి, పట్టణాధ్యక్షుడు రవీంద్రగుప్తా, శ్రీనివాస్ రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి నర్సారెడ్డి కూతురు సిద్దిపేట జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి కాంగ్రెస్ మండలాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డితో కలిసి మండలంలోని యావాపూర్, కిష్టాపూర్ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామాయంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం పట్టణ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన నాందేడ్ జిల్లాలోని ఉమ్రాకు సపాయి రాహుల్(25) బొలెరో వాహనంలో సోమవారం కూరగాయలు తీసుకొని హైదరాబాద్‌లో లోడ్ ఖాళీ చేసి, తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో రామాయంపేట శివారులో ఎన్‌హెచ్ 44 రోడ్డుపై బీఎస్ఎన్ఎల్ టవర్ వద్దకు రాగానే రోడ్డుపై వడ్ల బస్తాల లోడ్ ట్రాలీతో పాటు ఉన్న ట్రాక్టర్ చీకటిలో పార్క్ చేసి ఉంది. దీంతో రాహుల్ నడుపుతున్న బొలెరో ఆ ట్రాక్టర్ ట్రాలీకి తగిలి, రోడ్డు పైనే ఆగింది. వెంటనే వెనకాల వస్తున్న రాజధాని బస్సు వచ్చి బొలెరోకు తగిలింది. ఈ ప్రమాదంలో బొలెరో నడుపుతున్న రాహుల్‌కు తలకు, చేతులకు గాయాలయ్యాయి. వెంటనే అతన్ని అంబులెన్స్‌లో రామయంపేట ప్రభుత్వాస్పత్రికి తరలించగా, మరణించాడు. మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రంజిత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

క్రీడలతో అనేక లాభాలు : అమృతరావు

నర్సాపూర్: క్రీడలతో అనేక లాభాలు ఉంటాయని డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ డైరెక్టర్ అమృతరావు అన్నారు. నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసీ కాలేజీలో మంగళవారం విష్ణుకప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలు శరీరానికి మానసిక ఉల్లాసం ఇస్తాయని, ఆరోగ్యంగా ఉంటామని చెప్పారు. ప్రస్తుత యువత వీడియో గేమ్స్‌కు బానిసలుగా మారకూడదన్నారు. కార్యక్రమంలో విష్ణు ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి ఆదిత్య విస్సమ్, కాలేజీ ప్రిన్సిపాల్ రమేశ్, బీవీ ఆర్ఐటీ ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె తదితరులు పాల్గొన్నారు. క్రీడలు ఈనెల 18 వరకు కొనసాగుతాయని ప్రిన్సిపాల్ తెలిపారు. రాష్ట్రంలోని పలు ఫార్మసీ కాలేజీలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.


కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

మల్లుపల్లిలో ఉచిత వైద్య శిబిరం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని మల్లుపల్లిలో మంగళవారం లయన్స్ క్లబ్ బాలానగర్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దొంతి గ్రామానికి చెందిన వైద్యుడు సుబ్రహ్మణ్యం గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు.


గ్రామస్తులతో వైద్యుడు సుబ్రహ్మణ్యం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్‌కో ఏఈ దుర్గప్రసాద్ తెలిపారు. పాంబండ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల మీదుగా నూతనంగా వేస్తున్న 220 కేవీ విద్యుత్ లైన్ ఏర్పాటులో భాగంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. పాంబండ, పోతులబోగూడ, ఉసిరికపల్లి గ్రామాలతో పాటు పలు తండాల్లో విద్యుత్ ఉండదన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దశంకరంపేట(మెదక్): మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రఫీఖ్‌ఉన్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన ఉదయం నిర్వహించే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలన్నారు.

సభను విజయవంతం చేయండి

మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్ రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలోని సీఎస్ఐ మైదానంలో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరై ప్రసంగించనున్నట్లు మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం మధ్యాహ్నం 2 గంటల వరకు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

రైతుల ఆందోళన

శివ్వంపేట(నర్సాపూర్): ధర్మకాంటలో తూకం వేస్తే తక్కువ వస్తుందని రైతులు మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు. మండల పరిధిలోని చండీ గ్రామంలో ఉన్న ఓ ధర్మకాంటలో వడ్లలారీ తూకం వేయగా, తక్కువ వచ్చిందని రైతులు ఆరోపించారు. తూప్రాన్ – నర్సాపూర్ రోడ్డుపై ఆందోళన చేశారు. సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసులు ఆందోళనకారులకు నచ్చచెప్పి రాస్తారోకో విరమింపచేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఈటల విజయం తథ్యం**

మనోహరాబాద్(తూప్రాన్): గజ్వేల్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయం తథ్యమని బీజేపీ నాయకులు అన్నారు. మండలంలోని జీడిపల్లి, దండుపల్లిలో బీజేపీ నాయకులు, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు మల్లేశ్, మండల బీజేపీ అధ్యక్షుడు నరేందర్‌చారి, బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.

◆ **మహంకాళీ ఆలయంలో ఆకాశ దీపం**



చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట మహంకాళీ ఆలయంలో మంగళవారం సాయంత్రం ఆకాశదీపం ఏర్పాటు చేశారు. కార్తీక మాసం ప్రారంభం సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఆలయ మండపం పై భాగంలో ఆకాశ దీపం పెట్టారు. భక్తులు ఈ దీపాన్ని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని అర్చకుడు రాఘవశర్మ తెలిపారు.

◆ **కేసీఆర్ మెజార్టీ సాధించాలని ముడుపు**

మనోహరాబాద్(తూప్రాన్): సీఎం కేసీఆర్ మూడోసారి భారీ మెజార్టీ సాధించాలని రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి మండలంలోని రామాయపల్లి నెల్లూరమ్మ దేవాలయంలో మంగళవారం ముడుపులు కట్టారు. ఈ కార్యక్రమంలో రతన్‌లాల్, పాండు, ఉప సర్పంచ్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

◆ **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

హవేళిఘనాపూర్(మెదక్): మద్యానికి బానిసై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండల పరిధిలోని కప్రాయిపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అనుముల సంతోష్(28) కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఒక రోజు భార్యతో గొడవపడడంతో ఆమె తల్లిగారింటికి వెళ్లిపోయింది. దీంతో ఆయన ఈ నెల 10న ఇంట్లో ఎవరులేని సమయంలో డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గమనించిన ఇరుగుపొరుగువారు మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌గౌడ్ తెలిపారు.

◆ **పంచాయితీ వద్దన్నందుకు హోటల్ ధ్వంసం**

చిన్నశంకరంపేట(మెదక్): ఇద్దరు యువకులు ఘర్షణ పడుతుండగా వారించిన హోటల్ యజమానిపై ఆగ్రహంతో మరికొందరు యువకులు హోటల్‌లోని సామగ్రిని ధ్వంసం చేశారు. ఈ ఘటన చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లి చౌరస్తాలో చోటు చేసుకుంది. మంగళవారం రాత్రి గవ్వలపల్లి చౌరస్తాలో నర్సాగౌడ్ హోటల్ ఎదుట ఇద్దరు యువకులు ఘర్షణ పడుతుండగా హోటల్ నిర్వాహకుడు వారిని పంచాయితీ ఎందుకని వారించాడు. దీంతో ఆగ్రహం చెందిన ఓ యువకుడు తమ స్నేహితులను పిలిపించుకొని హోటల్‌లోని సామగ్రిని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీస్‌లు ఘటన స్థలానికి చేరుకొని ఘర్షణను నివారించారు. ఇరు వర్గాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


పార్టీలో చేరిన వారితో నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి


వెల్దుర్తి(తూప్రాన్): కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులతో జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి


పోచమ్మ ఆలయంలో రాజిరెడ్డి సతీమణిని సన్మానిస్తున్న నాయకులు

నర్సాపూర్: కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో చిలప్‌చెడ్ మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ.. తమ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలను ప్రజలు విశ్వసిస్తున్నారని, కాంగ్రెస్ తోనే సంక్షేమం అని అన్నారు. చిలప్‌చెడ్ వార్డు సభ్యులు నర్సింహగౌడ్, శ్రీకాంత్, సంతోష అర్జున్, మాజీ వార్డు సభ్యుడు యాదగిరి, ఇతర నాయకులు ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేశం తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆంజనేయులుగౌడ్, కరుణాకర్‌రెడ్డి, చిలప్‌చెడ్ మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జెడ్పీటీసీ శేషాసాయిరెడ్డి, పార్టీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పాండరి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి రాజిరెడ్డి విజయం తథ్యం

వెల్దుర్తి(తూప్రాన్): నర్సాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి విజయం తథ్యమని ఆ పార్టీ జిల్లా నాయకుడు నరేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్ అన్నారు. రాజిరెడ్డిని గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం మానెపల్లి గ్రామంలో బీఆర్ఎస్‌కు చెందిన వార్డు మెంబర్లు రమేశ్, నాగయ్య, సత్తయ్య, పోచయ్య, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ఇంటింటి ప్రచారం

హత్నూర(సంగారెడ్డి): నర్సాపూర్ గడ్డపై కాంగ్రెస్ విజయం సాధించడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి సతీమణి శైలజ అన్నారు. మంగళవారం హత్నూర మండలంలోని షేర్‌ఖాన్‌పల్లి, రొయ్యపల్లి, అకవంచగూడ, నాగారం, కోడిపాక, వడ్డేపల్లి, ఎల్లమ్మ గూడా గ్రామాల్లో ఆమె ఇంటింట ప్రచారం విస్తృతంగా నిర్వహించారు. మొదట హత్నూర మండలంలోని పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ.. రెండు సార్లు మదన్‌రెడ్డి, మూడుసార్లు సునీతారెడ్డి ఎమ్మెల్యేగా పనిచేసిన నియోజకవర్గంలో ఏ గ్రామం కూడా అభివృద్ధి కాలేదన్నారు. ఒక్కసారి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డికి అవకాశం ఇస్తే అందుబాటులో ఉండి ప్రజలకు సేవ చేస్తాడని తెలిపారు. గ్రామ గ్రామాన పెద్ద ఎత్తున ప్రజల నుంచి కాంగ్రెస్ పార్టీకి ఘన స్వాగతం లభిస్తుందని, ఇందుకు తన ప్రచారానికి ప్రజల మద్దతే నిదర్శనమన్నారు. రొయ్యపల్లి గ్రామస్తులంతా తమ మద్దతు తెలియచేసి ఈసారి కాంగ్రెస్ పార్టీకే ఓటు వేస్తామని, గ్రామంలో ఏకగ్రీవ తీర్మానం చేశారని చెప్పారు. నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుజాత, మాజీ జెడ్పీటీసీ జయశ్రీ, మండల అధ్యక్షుడు కృష్ణ, దౌల్తాబాద్ సర్పంచ్ కొన్యాల వెంకటేశం, నాయకులు మనీ, ప్రసాద్, పాటు పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న ఆవుల రాజిరెడ్డి సతీమణి శైలజ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264